## క్లుప్తంగా

### పేదలందరికీ సంక్షేమ పథకాలు



బ్రోచర్లు విడుదల చేస్తున్న వెంకటకృష్ణారెడ్డి, చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: వైఎస్సార్‌సీపీ పాలనతో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని 32వ వార్డులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ప్రత్యక్షంగా, పరోక్షంగా అందించిన నిధుల పట్టిక బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా టీడీపీ నాయకుల ఇళ్లకు కూడా సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఇళ్లులేని నిరుపేదలు ఉండకూడదనే జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గుండెపోటుతో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడి మృతి



బాబూరావు (ఫైల్)

కదిరి అర్బన్: పట్టణంలో షరాఫ్ నారాయణరావు వీధిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బాబూరావు (80) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాబూరావు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాదాపీర్, షబ్బీర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### విరాళం అందజేత



గంగమ్మ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని ఉబ్బదేవర గంగమ్మ దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి రూ.32 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే తండ్రి చిన గంగిరెడ్డి చేతులమీదుగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ధర్మవరం వాసికి జన సేవారత్నం అవార్డు



కన్నా వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: విజయవాడలోని శ్రీరామ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జనసేవ సొసైటీ ఆధ్వర్యంలో జన సేవారత్నం పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ధర్మవరం పట్టణానికి చెందిన రక్తబంధం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కన్నా వెంకటేష్‌కు శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, ఆయుర్వేదిక్ వైద్యుడు ఆనంద్, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌ల చేతులమీదుగా జన సేవారత్నం పురస్కారం అందజేశారు. అలాగే ప్రశంసాపత్రం, మెమెంటో అందించి సన్మానించారు.

### రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మృతి



మృతి చెందిన ఆంజనేయులు

కదిరి టౌన్: రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు (47) మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం పట్టణంలోని స్వగృహంలో చనిపోయారు. విషయం తెలుసుకున్న రజక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి సాయిశీన, మీసాల రంగప్ప తదితరులు నివాళులర్పించారు. ఏపీ రజక సంఘం నాయకులు పుట్టపర్తి శివప్ప, టీచర్లు లక్ష్మన్న, నారాయణ, శ్రీనివాసులు, పెద్దయ్య, నాగరాజు, రామ్‌కుమార్, ఆర్టీసీ నారాయణ, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్, సీపీఎం పట్టణ అధ్యక్షుడు జీఎల్ నరసింహులు, తదితర పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# రోల్‌మోడల్‌గా ధర్మవరం మున్సిపాలిటీ

- సంపద సృష్టించి ఆదాయం పెంచుతున్నాం
- ఎమ్మెల్యేలు కేతిరెడ్డి, శంకర నారాయణ
- రూ.1.90 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కాంప్లెక్స్ ప్రారంభం



వకీలు పెద్దయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కేతిరెడ్డి, శంకరనారాయణ

ధర్మవరం: అభివృద్ధిలో ధర్మవరం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో రూ.1.90 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. నూతన కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే శంకర నారాయణ తండ్రి, ధర్మవరం మున్సిపల్ మాజీ చైర్మన్ మాలగుండ్ల పెద్దయ్య (వకీల్ పెద్దయ్య) కాంప్లెక్స్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ మాట్లాడుతూ.. ధర్మవరం పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. నూతన కాంప్లెక్స్‌కు తన తండ్రి మాలగుండ్ల పెదయ్య పేరు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. తమ కుటుంబం ఎప్పుడు కేతిరెడ్డికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కాంప్లెక్స్ పక్కన భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు సహాయం అందించిన కేతిరెడ్డి కృషి అభినందనీయమన్నారు. కురుబల సంపూర్ణ మద్దతు కేతిరెడ్డికి ఉంటుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గుడ్‌విల్ యాక్షన్ పద్ధతిన పారదర్శకంగా మున్సిపల్ కాంప్లెక్స్‌లు, కాయగూరల మార్కెట్ భవన సముదాయాలను నిర్మించినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ఇప్పటి దాకా రూ.200 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గతంలో అయితే మున్సిపాలిటీలో ఆదాయం లేక ఉద్యోగుల జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి ఉండేదన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో 010 పద్దు ద్వారా జీతాలు ట్రెజరీ ద్వారా ప్రతి నెలా చెల్లించే విధంగా చర్యలు చేపట్టారన్నారు.

**నీచ రాజకీయాలు మానుకోండి..**

ధర్మవరం పట్టణంలో ఇటీవల కాలంలో షో పుటప్ రాజకీయ నాయకులు ఎక్కువ అయ్యారని మండిపడ్డారు. వారితో అప్రమత్తంగా ఉండాలని పరోక్షంగా బీజేపీ నాయకుడు వరదాపురం సూరిని ఎమ్మెల్యే కేతిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని ప్రధాన రహదారి గుంతల మయంగా ఉండటంతో తాము రూ.4 కోట్లతో నూతనంగా నిర్మించేలా ప్రభుత్వం జీవో ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల టెండర్లు సైతం పూర్తి కావడంతో ఈ విషయం తెలుసుకుని తాము రోడ్డు వేస్తామని చెబుతూ హడావుడి చేస్తున్నారన్నారు. నిజంగా రోడ్డు వేసే ఉద్దేశం ఉంటే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. సోమవారం నుంచి ధర్మవరం పట్టణ ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఇకనైన నీచ రాజకీయాలు మానుకుని చేసిన అభివృద్ధిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, 40 వార్డుల ఇన్‌చార్జ్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పార్క్, ఓపెన్ జిమ్ ప్రారంభం



నూతనంగా నిర్మించిన మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: సుందరయ్య నగర్ వాసుల చిరకాల కోరిక అయిన మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం 29వ వార్డు సుందరయ్య నగర్‌లో మున్సిపల్ నిధులు, దాతలు కోటిరెడ్డి గంగిరెడ్డి, శాంతమ్మల జ్ఞాపకార్థం రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముందు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డిపై కాలనీవాసులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి.. పార్కు, ఓపెన్ జిమ్ ప్రాంతంలో కలియ తిరుగుతూ పరికరాలను పరిశీలించారు. అనంతరం చిన్నపిల్లలతో జిమ్‌లో సాధన చేయించారు. మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీ, దాతల సహకారంతో పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. రిపబ్లిక్ డే రోజున ప్రజలకు అందుబాటులోకి తేవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### శ్రమదానం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో శుక్రవారం యర్రగుంట్లపల్లిలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను విద్యార్థులు తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణానాయక్, యూనిట్–2 ప్రోగ్రాం ఆఫీసర్ హనుమంతరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

### రేపు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం బైరాపురంలో ఆదివారం వైఎస్సార్ విగ్రహావిష్కరణ ఉంటుందని దాత ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి, ధర్మవరం, రాప్తాడు ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ హాజరవుతారన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగుబ్బ: మండలంలోని రాళ్లనంతపురం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివతేజ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

## నేటితో ముగియనున్న పాదయాత్ర



చెర్లోపల్లిలో ఆవిష్కరించనున్న శిలాఫలకం

పుట్టపర్తి అర్బన్/పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వడివడిగా అడుగులు వేస్తున్నారు. 9 రోజుల పాటు పుట్టపర్తి నియోజకవర్గంలో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్ర శనివారంతో ముగియనుంది. నియోజకవర్గంలో 2 రిజర్వాయర్ల నిర్మాణానికి చేపట్టిన పాదయాత్ర నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో కొనసాగింది. శనివారం పుట్టపర్తి రూరల్ మండలంలోని కర్ణాటక నాగేపల్లి, వీరాంజనేయపల్లి, వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి వద్ద ముగుస్తుంది. ఆరు మండలాల పరిధిలో సుమారు 165 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తవుతుంది. అక్కడ చెరువు సమీపంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, రైతుల ఆధ్వర్యంలో బహిరంగ సమావేశం నిర్వహించనున్నారు.

**ఐరన్ పైపులు సిద్ధం..**

142 కిలోమీటర్ల భారీ పైప్‌లైన్ వేసేందుకు చెర్లోపల్లి వద్ద సుమారు 50 కిలోమీటర్లకు సరిపడా ఐరన్ పైపులు సిద్ధంగా ఉన్నాయి. సుమారు 142 కిలో మీటర్ల పైప్‌లైను, 50 కిలో మీటర్ల సప్లై ఛానళ్ల ద్వారా కృష్ణా జలాలను చెరువులకు తరలించనున్నారు. చెర్లోపల్లి వద్ద ఇంజినీర్లు, సిబ్బంది, కూలీల కోసం తాత్కాలిక నివాసాలు సైతం సిద్ధం చేశారు. క్రెయిన్‌లు, హిటాచీలు, జేసీబీలు సిద్ధం చేశారు. 142 కిలోమీటర్లకు సరిపడా పైపులు సిద్ధంగా ఉన్నాయని సైట్ ఇంజినీర్లు పేర్కొన్నారు. వీటిని రిజర్వాయర్లు నిర్మించనున్న గాజులపల్లి, ఎన్.ఎనుములవారిపల్లి వద్ద భద్రపరచనున్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టగానే 193 చెరువులకు అవసరమైన కృష్ణా జలాలు కావాలని 3 టీఎంసీల నికర జలాలు కోసం ఎమ్మెల్యే అనుమతులు సాధించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో బుక్కపట్నం, మారాల పెద్ద చెరువులు ఉండగా ఇకపై గాజులపల్లి, ఎనుములవారిపల్లిలో నిర్మించనున్నారు. రిజర్వాయర్ల నుంచి 193 చెరువులకు నీటిని సరఫరా చేయనున్నారు. వీటితో పాటు 9 చోట్ల ఎత్తిపోతలకు సిద్ధం చేస్తారు. ఇవి పూర్తయితే నియోజకవర్గంలోని ఆరు మండలాలు సస్యశ్యామలం కానున్నాయి.

### ఆర్బీకేలతో రైతులకు మేలు



నాయకులతో కలిసి ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను పెద్ద ఎత్తున నిర్మిస్తోంది. వీటి వలన రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తచెరువు మండలంలో పలు ఆర్బీకేలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రైతులు విత్తనాలు, మందుల కోసం మండల కేంద్రాలకు వెళ్లి తీసుకోవాల్సి ఉండేదన్నారు. నేడు వారి గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి,ఎంపీపీ గాయత్రీ, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

నల్లచెరువు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. శుక్రవారం అమడగూరు మండలం ఏటిగట్టు తండాకు చెందిన భుక్యా కృష్ణానాయక్ కర్ణాటక నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్నాడని సమాచారం అందింది. ఎస్‌ఐ తింగన్న సిబ్బందితో కలిసి మండల పరిధిలోని దామవాండ్లపల్లి వద్దనున్న మారెమ్మ గుడి సమీపంలో భుక్యా కృష్ణానాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 55 టెట్రా ప్యాకెట్లు కర్ణాటక మద్యం, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### డ్రిప్ పైపుల దగ్ధం

నల్లమాడ: మండలంలోని బాపనకుంట వద్ద శుక్రవారం విద్యుత్ తీగలు తెగి కింద పడటంతో మంటలు వ్యాపించి ఏడు ఎకరాల్లో అమర్చిన డ్రిప్ పైపులు కాలి బూడిదైనట్లు బాధిత రైతులు దారా లక్ష్మీపతి, సుధాకర, రవీంద్ర తెలిపారు. రెండు లైన్లు దగ్గరగా ఉండటంతో గాలికి విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలడంతో ఓ విద్యుత్ తీగ తెగి పడిందన్నారు. వెంటనే మంటలు చెలరేగడంతో ఏడెకరాల్లో అమర్చిన డ్రిప్ పైపులు మొత్తం కాలి బూడిదైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించిన సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ రాజేంద్ర ప్రసాద్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ సహకార సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్

తనకల్లు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సింగిరివాండ్లపల్లి క్రీడా మైదానంలో ప్రజా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. క్రికెట్ టోర్నీని విజయవంతంగా నిర్వహించిన ప్రజా హాస్పిటల్ చెరుకూరి మధుకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన మార్పురివాండ్లపల్లి జట్టుకు రూ. 20 వేలు నగదు, కప్పు, రన్నర్స్ గుంజువారిపల్లి జట్టుకు రూ. 10 వేల నగదును మక్బూల్ అహమ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, నాయకులు వజ్ర భాస్కర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు చెరుకూరి గంగులయ్య, ఆరుద్ర శ్రీనివాస్, కోటకొండ కిష్టప్ప, చంద్రమోహన్ మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు కొండా మల్లికార్జున, దొరస్వామి, అశోక్‌రెడ్డి, ముస్తఫా, తాహీర్, వలి, ముబారక్, ఆర్గనైజర్లు లక్ష్మీనారాయణ, శీనా, వినోద్, మహమ్మద్ పాల్గొన్నారు.

**మక్బూల్ అహ్మద్‌కు సన్మానం**

కదిరి టౌన్: పట్టణంలో ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పెన్షనర్లకు ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మక్బూల్ అహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఆత్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్ర భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధం



సుందరంగా రూపుదిద్దుకున్న సచివాలయం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం చెర్లోపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్ర ముగింపు సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో శనివారం భవనాలను ప్రారంభించనున్నారు. రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో ఆర్బీకే భవనం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను అన్ని హంగులతో నిర్మించారు. గ్రామం మధ్యలో రూ.6 లక్షలతో పీర్ల చావిడిని నిర్మించారు. అన్ని పథకాలతో పాటు నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో గ్రామంలోని నివసిస్తున్న సుమారు 100 మందికి ఇళ్లు నిర్మిస్తున్నారు. ఒక్క చెర్లోపల్లి గ్రామానికి డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు 22.5 కోట్ల లబ్ధి చేకూరింది.

## సేవలకు పట్టం



పి.షాజహాన్, ఏడీఏ



సురేశ్‌బాబు, ఎస్‌ఐ, కొత్తచెరువు



మల్లికార్జున రెడ్డి, ఎస్‌ఐ, ఓడీసీ



జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న హరిమోహన్



నాగస్వామి, ఎస్‌ఐ, తాడిమర్రి



ఉత్తన్న, ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్



విజయలక్ష్మి, ఎంపీడీఓ, తాడిమర్రి

తాడిమర్రి/కదిరి అర్బన్/నల్లచెరువు/కదిరి టౌన్/బత్తలపల్లి/ముదిగుబ్బ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ మండలాల్లో పని చేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, డీఈఓ చాముండేశ్వరి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

### ధర్మవరం కమిషనర్‌గా రామ్‌కుమార్

ధర్మవరం అర్బన్: ధర్మవరం మున్సిపల్ నూతన కమిషనర్‌గా టి.రామ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ బండి శేషన్నను తెనాలికి బదిలీ చేశారు. మండపేటలో కమిషనర్‌గా ఉన్న టి.రామ్‌కుమార్‌ను ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. త్వరలో నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టనున్నారు.



పుట్టపర్తి టౌన్: పోలీస్ క్యాంప్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



పుట్టపర్తి అర్బన్: త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేస్తున్న జేసీ అభిషేక్ కుమార్



కదిరి అర్బన్: మదరసా పుర్ఖానియాలో మాట్లాడుతున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

## మువ్వన్నెల రెపరెపలు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో జెండాలను ఆవిష్కరించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. కొత్తచెరువు మండలం తలమర్ల పాఠశాలలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, తలుపులలో సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ జెండా ఎగురవేశారు. పాఠశాలల్లో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతీయ నాయకుల వేషధారణలతో ర్యాలీ చేపట్టారు.

– సాక్షినెట్‌వర్క్:



ఓడీచెరువు మండలంలో విద్యార్థుల ర్యాలీ



కొత్తచెరువులో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ధర్మవరం అర్బన్: దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు

### జోరుగా ధర్మవరం–పులివెందుల రహదారి పనులు

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి మీదుగా వెళుతున్న ధర్మవరం–పులివెందుల రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జొల్లిరెడ్డి అశ్వర్థ, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి తదితరులు పనులను పరిశీలించారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం నుంచి తాడిమర్రి మీదుగా లింగాల మండలం పార్నపల్లి వరకు రూ.30 కిలోమీటర్ల రహదారి నిర్మాణం కోసం ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.7 కోట్ల నిధులు మంజూరు చేశాయి. తాడిమర్రి నుంచి పార్నపల్లి వరకు రూ.3 కోట్లతో 20 కిలోమీటర్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రస్తుతం మాల్యవంతం నుంచి తాడిమర్రి వరకూ 10 కిలోమీటర్ల మేర రూ.4 కోట్లతో డబల్ రోడ్డుపై తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పొరాళ్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

కనగానపల్లి: ప్రైవేట్ స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. దాదులూరు, చంద్రశ్చర్ల నుంచి పలువురు విద్యార్థులు ధర్మవరంలోని ప్రైవేట్ పాఠశాలకు బస్సులో వెళ్తుంటారు. శుక్రవారం ఉదయం జీవానంద పాఠశాలకు చెందిన బస్సు దాదులూరులోని కొందరు పిల్లలకు ఎక్కించుకొని జాతీయ రహదారి పక్కన ఉన్న చంద్రశ్చర్లకు వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన ఒక ఐచర్ వాహనం ఢీకొట్టింది. బస్సుకు వెనుక వైపు ఉన్న అద్దాలు పగిలి ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో విద్యార్థులంతా ముందు వైపు కూర్చొని ఉండడంతో సురక్షితంగా బయటపడ్డారు.

### వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

తనకల్లు: బాలసముద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న నక్కల వీరాంజనేయులుకు వైద్య ఖర్చుల నిమిత్తం సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణమ్మ, ముస్తాఫా, మల్లికార్జున, దాదాపీర్, అశోక్‌రెడ్డి, నాయుడు, లక్ష్మీపతి, కొండయ్య ఉన్నారు.

### పాముకాటుతో ఎద్దు మృతి

తనకల్లు: గుంజువారిపల్లిలో రైతు ఆంజనేయులుకు చెందిన ఎద్దు శుక్రవారం పాముకాటుతో మృతి చెందింది. ఎద్దును మేత కోసం పొలంలో కట్టేసి ఆంజనేయులు ఇంటికి వచ్చేశాడు. తిరిగి పొలం దగ్గరకి వెళ్లి చూడగా ఎద్దు అపస్మారక స్థితిలో ఉంది. పశు వైద్యులకు సమాచారం ఇవ్వగా.. పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. రూ.70 వేల నష్టం వాటిల్లిందన్నాడు.